నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్ - నిర్మల్
5 | నిజామాబాద్ బుధవారం 23 అక్టోబర్ 2024 | ADILABAD NIRMAL

# నిరసన సభకు తరలిరండి

● కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగడుతాం.. ● మాజీ మంత్రి జోగు రామన్న


మాట్లాడుతున్న మాజీ మంత్రి జోగు రామన్న

ఆదిలాబాద్, అక్టోబర్ 22(నమస్తే తెలంగాణ) : బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రేపు(గురువారం) ఆదిలాబాద్‌లో నిర్వహించనున్న నిరసన సభకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరవుతారని, పార్టీలకు అతీతంగా ప్రజలు తరలిరావాలని మాజీ మంత్రి జోగు రామన్న పిలుపునిచ్చారు. మంగళవారం బీఆర్ఎస్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని చెప్పి మోసం చేసిందని మండిపడ్డారు. వంద రోజుల్లో అమలు చేస్తామని ప్రకటించిన గ్యారెంటీల్లో ఉచిత బస్సు సౌకర్యం తప్పా 300 రోజులు గడిచినా ఏమీ అమలుకావడం లేదన్నారు. వానకాలం రైతుభరోసాను ఎగ్గొట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం కమిటీల పేరిట జాప్యం చేస్తున్నదని, షరతులు విధిస్తుందన్నారు. గిరిజన రైతులు సాగు చేస్తున్న భూములకు బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టాలు పంపిణీ చేసిందని, నిబంధనలు విధిస్తూ గిరిజన రైతులను రైతుభరోసాకు దూరం చేస్తుందన్నారు.

**కమిటీల పేరిట కాలయాపన**

పార్లమెంట్ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఓట్ల కోసం రైతుబంధు పథకాన్ని అందరు రైతులకు అందజేసిందని, ఎన్నికల తర్వాత కమిటీలు పేరిట కాలయాపన చేస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను అమలు చేస్తుందన్నారు. ఎన్నికలప్పుడు ఇచ్చిన 420 హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. రూ.4 వేల పింఛన్, ఏడాదికి 2 లక్షల ఉద్యోగాలు, కల్యాణలక్ష్మీ–షాదీ ముబారక్ తులం బంగారం పథకాలు ఏమయ్యాయని ప్రశ్నించారు. జిల్లాలో పత్తి రైతులకు గుజరాత్ మాదిరి ధర చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రోకండ్ల రమేశ్, మెట్టు ప్రహ్లాద్, విజ్జిగిరి నారాయణ, అజయ్, గండ్రత్ రమేశ్, కుమ్ర రాజు, వేణుగోపాల్, పరమేశ్వర్, శ్రీనివాస్, సోనేరావు, అయ్యాబ్ పాల్గొన్నారు.

# పేరు నమోదు చేసుకోవాలి


వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ చైన్‌గేట్, అక్టోబర్ 22 : అర్హులైన ప్రతి ఒక్కరూ ఉపాధ్యాయ, పట్టభద్రుల ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం హైదరాబాద్‌లోని రాష్ట్ర ప్రధాన కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అర్హులైన వారు ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకునే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. స్వీప్ ఆధ్వర్యంలో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. పాఠశాలలు, కళాశాలల్లో ఉపాధ్యాయులకు ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకునే విధంగా ప్రోత్సహించాలన్నారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్, డీఆర్వో భుజంగరావు, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు శ్రీనివాస్, డీఆర్వో విజయలక్ష్మి పాల్గొన్నారు.


# నాణ్యమైన విద్య అందించాలి

● కలెక్టర్ రాజర్షి షా

ఇచ్చోడ(సిరికొండ), అక్టోబర్ 22 : విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. మంగళవారం సిరికొండ మండలంలోని సుంకిడి అంగన్‌వాడీ కేంద్రం, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, సిరికొండ జిల్లా పరిషత్ సెకండరీ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారం గురించి తెలుసుకున్నారు. బరువు తక్కువగా ఉన్న చిన్నారులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కేంద్రంలో ఉన్న చిన్నారులలో శ్యాం మామ్ పిల్లలను గుర్తించి పౌష్టికాహారం అందించాలన్నారు. అనంతరం అక్కడే ఉన్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థుల అభ్యాస సామర్థ్యాలను స్వయంగా పరీక్షించారు. విద్యార్థుల హాజరు రిజిష్టర్ పరిశీలించి గైర్హాజరైన విద్యార్థుల గురించి అడిగి తెలుసుకుని, గైర్హాజరు కాకుండా తల్లిదండ్రులతో మాట్లాడి పాఠశాలకు హాజరయ్యేలా చూడాలన్నారు. అనంతరం సిరికొండ జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలను సందర్శించి తల్లిదండ్రులు కోల్పోయిన విద్యార్థులు రిశ్వంత్, మేఘన ఇద్దరిని బాలికను ఆదిలాబాద్ రెసిడెన్షియల్ పాఠశాల సోషల్ వెల్ఫేర్ బాలికల పాఠశాలలో, బాలుడిని ఇచ్చోడ బాయ్స్ స్కూల్‌లో చేర్పించుటకు ఆర్‌సీవోతో కలెక్టర్ మాట్లాడారు. మధ్యాహ్నం భోజనంపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్నం భోజనంలో పప్పుతోపాటు ఆకు కూరలు, కూరగాయలు ఎక్కువగా ఉండాలని, నాణ్యత ప్రమాణాలు పాటించాలని అన్నారు. చదువులో సబ్జెక్టులో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి, అభ్యాస సామర్థ్యాలను పెంపొందించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. కలెక్టర్ వెంట డీఈవో ప్రణీత, తహసీల్దార్ తుకారాం, ఎంఈవో సునీల్, ఎంపీడీవో రవీందర్, ఎంపీవో సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.


సిరికొండలో పదో తరగతి విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్

● తమకు ప్రాధాన్యం దక్కలేదంటూ మండిపడుతున్న సీనియర్లు
● ఇతర పార్టీల ఎమ్మెల్యేలున్న నియోజకవర్గాల్లో గందరగోళం
● ఎమ్మెల్యేలతోపాటు సెపరేట్ లిస్టును అందజేసిన కాంగ్రెస్ ఇన్‌చార్జిలు
● రాజకీయ పార్టీల జోక్యంతో తలలు పట్టుకుంటున్న అధికారులు



# కాంగ్రెస్‌కు తలనొప్పిగా ఇందిరమ్మ కమిటీలు!

## కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఉన్న నియోజకవర్గాల్లో ఫైనలైన కమిటీలు

మంచిర్యాల, అక్టోబర్ 22(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 'ఇందిరమ్మ కమిటీల' ఏర్పాటు అధికార కాంగ్రెస్ పార్టీకి తలనొప్పిగా మారింది. పేదలకు ఇండ్లు సమకూర్చడంతోపాటు సంక్షేమ పథకాల అమలుకు మండలాలు, పట్టణాల్లో ఇందిరమ్మ కమిటీలు ఏర్పాటు చేయాలని సర్కారు నిర్ణయించింది. ఈ నెల 12లోగా కమిటీల నియామక ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించింది. కానీ.. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఈ కమిటీల వ్యవహారం కొలిక్కి రాలేదని తెలుస్తున్నది. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు ఉన్న నియోజకవర్గాలు మంచిర్యాల, చెన్నూర్, బెల్లంపల్లి, ఖానాపూర్‌లో దాదాపు కమిటీలు ఫైనల్ అయ్యాయి. బీఆర్ఎస్, బీజేపీ ఎమ్మెల్యేలు ఉన్న మిగిలిన ఆరు నియోజకవర్గాల్లో కమిటీల విషయంలో క్లారిటీ రాలేదని తెలుస్తున్నది. ఆదిలాబాద్, బోథ్, నిర్మల్, ముథోల్, ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ నియోజకవర్గాల్లో కమిటీలకు సంబంధించి ఎమ్మెల్యేలు ఒక లిస్టు ఇవ్వగా.. స్థానిక అధికార పార్టీ లీడర్లు మరో లిస్టు ఇచ్చినట్లు సమాచారం. కమిటీల్లో ఇలా రాజకీయ జోక్యం, ఒత్తిడి పెరిగిపోవడంతో ఏం చేయాలో అర్థంకాని పరిస్థితుల్లో అధికారులు తలలు పట్టుకుంటున్నట్లు తెలిసింది. నిబంధనల ప్రకారం ఇందిరమ్మ కమిటీలలో ప్రతిపాదించిన వారి పేర్లను సంబంధిత మండలాల ఎంపీడీవోలు, మున్సిపాలిటీల కమిషనర్లు కలెక్టర్‌కు ఇవ్వాలి. కలెక్టర్ ఇచ్చే జాబితాలో నుంచి సంబంధిత జిల్లా ఇన్‌చార్జి మంత్రి కమిటీలను ఫైనల్ చేస్తారు.

**అసంతృప్తిలో సీనియర్లు..**
**నిరసనలకు దిగే చాన్స్..**

నిబంధనల ప్రకారం గ్రామ పంచాయతీలో సర్పంచ్ లేదా జీపీ స్పెషల్ ఆఫీసర్ చైర్మన్‌గా, మున్సిపాలిటీలలో వార్డు కౌన్సిలర్ ఇందిరమ్మ కమిటీ చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. వార్డు/డివిజన్ అధికారి కమిటీల కన్వీనర్లుగా ఉంటారు. ఇద్దరు స్వయం సహాయక సంఘాల మహిళలతోపాటు ముగ్గురు స్థానికులు సభ్యులుగా ఉంటారు. ఈ సభ్యుల విషయంలోనే ఇప్పుడు వివాదాలు తలెత్తుతున్నాయి. అధికార పార్టీ ఎమ్మెల్యేలు ఉన్న దగ్గర ఇందిరమ్మ కమిటీల్లో కాంగ్రెస్ నాయకులకు అధిక ప్రాధాన్యం ఇచ్చారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కాగా.. ఈ కమిటీల్లోనూ కాంగ్రెస్ పార్టీకి చెందిన సీనియర్ లీడర్లను కాదని, ఈ మధ్య కాలంలో ఇతర పార్టీల్లో నుంచి వచ్చిన వారికి అవకాశం ఇచ్చారనే అసంతృప్తి రగులుతోంది. తమను పక్కన పెట్టడంపై సీనియర్లు గుర్రుగా ఉన్నారు. ప్రస్తుతం ఎవరూ బయట పడనప్పటికీ ఇన్‌చార్జి మంత్రి కమిటీలను ఫైనల్ చేశాక.. మా పేర్లు రాకపోతే నిరసనలకు దిగుతాం అంటూ కొందరు కాంగ్రెస్ లీడర్లు అంటున్నారు. బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధిలో సీనియర్లకు చాన్స్ రాలేదని, కమిటీలు ఫైనలయ్యాక అంతా కలిసి నల్ల బ్యాడ్జీలతో నిరసనలు తెలపాలని నిర్ణయించుకున్నామని అధికార పార్టీ నాయకులు ఒకరు చెప్పారు. ఇక చెన్నూర్ నియోజకవర్గంలో ఇందిరమ్మ కమిటీల కోసం ఎమ్మెల్యే వివేక్ ఒక లిస్ట్ ఇవ్వగా, ఆయన పీఏ మరో లిస్టును అధికారులకు ఇచ్చారనే గుసగుసలు వినిపిస్తున్నాయి. ఈ విషయాన్ని ఆ పార్టీ నాయకులే స్వయంగా చెప్తున్నారు. పార్టీ కోసం కష్టపడిన మా పేర్లు కమిటీల్లో లేకపోతే మంచిగా ఉండదంటూ చెన్నూర్ నియోజకవర్గంలో పలువురు నాయకులు హెచ్చరిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఇందిరమ్మ కమిటీలు అధికార పార్టీకి కొత్త తలనొప్పి తీసుకురానున్నా అంటే అవుననే సమాధానాలు వినిపిస్తున్నాయి.

**పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక కష్టమే..**

ఇండ్ల నిర్మాణం కోసం రూ.ఐదు లక్షల చొప్పున రాష్ట్రంలో నాలుగున్నర లక్షల మందిని మొదటిదశలో ఎంపిక చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అర్హులైన వారిని ఎంపిక చేయడం కోసం గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీల్లో స్థానికులను భాగస్వాములను చేస్తూ ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటు చేయాల్సి ఉంది. కానీ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో మాత్రం కమిటీల్లో ఉండాల్సిన స్థానికుల స్థానంలో కాంగ్రెస్ లీడర్లే ఎక్కువ మంది ఉన్నారనే ఆరోపణలు వస్తున్నాయి. దీంతో అర్హులైన పేదలకు బదులు, అధికార పార్టీ లీడర్లు, స్థానిక కార్యకర్తలను ఎంపిక చేస్తే పరిస్థితి ఏంటన్నది అర్థం కావడం లేదు. అదే జరిగితే పేదలకు చేయూత నివ్వాలనే పథక లక్ష్యం నిరుగారిపోయే ప్రమాదం ఉంది. ఈ విషయంలో మరి ప్రభుత్వం ఏం చేస్తుంది. ఇందిరమ్మ కమిటీల్లో పారదర్శకతపై స్పష్టత ఏం ఇస్తుందన్నది ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది.

డబ్ల్యూబీజేడీఎఫ్‌కు సంఘీభావం ప్రకటిస్తున్న ఐఎఫ్‌టీయూ సభ్యులు




# 'అభయ' నిందితులను శిక్షించాలి

ఎదులాపురం, అక్టోబర్ 22 : అభయకు న్యాయం చేయాలని పశ్చిమ బెంగాల్‌లో జూనియర్ డాక్టర్స్ ఫెడరేషన్(డబ్ల్యూబీజేడీఎఫ్) చేస్తున్న పోరాటానికి ఐఎఫ్‌టీయూ సంఘీభావం తెలుపుతున్నట్లు ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట నారాయణ అన్నారు. సుప్రీంకోర్టు న్యాయం జరిపించాలని కోరుతూ ఐఎఫ్‌టీయూ జాతీయ కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా మంగళవారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌక్‌లో పశ్చిమ బెంగాల్ జూనియర్ డాక్టర్స్ ఫెడరేషన్(డబ్ల్యూబీజేడీఎఫ్) చేస్తున్న పెన్ డౌన్ పోరాటానికి సంఘీభావం తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. అభయకు తక్షణ న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ డబ్ల్యూబీజేడీఎఫ్ పోరాటానికి మద్దతు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు గౌరాల సుభాష్, నర్సింగ్, ప్రసాద్, పెర్క గంగమ్మ, దండేకర్ వామన్, మడావి గణేశ్, మెస్రం మారుతి, టౌఫిక్, కనక దత్తు, లక్ష్మి పాల్గొన్నారు.

# అజ్జర్-వజ్జర్ అటవీ ప్రాంతంలో పులి సంచారం

బోథ్, అక్టోబర్ 22 : బోథ్ మండలంలోని అజ్జర్–వజ్జర్ అటవీ ప్రాంతంలో పులి సంచారంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. మంగళవారం చింతల్‌బోరి ప్రాజెక్టు ఎగువ ప్రాంతంలో పెద్ద గూడ సమీపంలోని అటవీ ప్రాంతంలో పెద్దపులి కనిపించినట్లుగా కొందరు గ్రామస్తులు పేర్కొన్నారు. పులితోపాటు పిల్లలు ఉన్నట్లుగా వారు పేర్కొన్నారు. కాగా.. అటవీ ప్రాంతంలో పులి సంచారంతో పెద్దగూడ, మాదుగూడ, లెండిగూడ, నాగ్‌గూడ్, కేశవ్‌గూడ, జైతుగూడ గ్రామాల గిరిజనులు ఆందోళన చెందుతున్నారు. అటవీ ప్రాంతం గుండా ఉన్న రోడ్డుపై తాము రాకపోకలు కొనసాగిస్తామని, ఎప్పుడు ఏం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. పులి సంచారం నిజామా? కాదా? అని అటవీ శాఖ అధికారులు నిర్ధారించాలి.

# ఏఈవోలపై సస్పెన్షన్ వేటు..!

## పని ఒత్తిడితో డిజిటల్ క్రాప్ సర్వేకు నిరాకరణ

● గ్రామానికో విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ కావాలని స్పష్టం
● రైతు మరణాల నమోదులో అలసత్వం కారణంగా చూపి పలువురిపై చర్యలు
● ఇది కక్ష సాధింపు చర్యేనంటున్న వ్యవసాయ విస్తరణ అధికారులు

మంచిర్యాల, అక్టోబర్ 22(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : తెలంగాణలో పని చేస్తున్న కొందరు వ్యవసాయ విస్తరణ అధికారులు(ఏఈవో)లను రాష్ట్ర ప్రభుత్వం సస్పెన్షన్ చేసినట్లు తెలిసింది. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన అగ్రికల్చర్ డిజిటల్ మిషన్‌లో భాగంగా అన్ని రాష్ట్రాల్లో క్రాప్ సర్వే చేసి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించింది. పక్క రాష్ట్రాలు కేంద్రం ఇచ్చిన నిధులతో ప్రత్యేక ఏజెన్సీలు, ఇతర శాఖల సాయంతో సర్వే చేయిస్తుంటే.. తెలంగాణలో మాత్రం ఆ పనిని ఏఈవోలతో చేయించేందుకు ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. ఇప్పటికే 49 రకాల పనులు చేస్తున్న తాము ఈ డిజిటల్ సర్వేను చేయలేమని, పనిభారాన్ని అర్థం చేసుకోవాలని ఏఈవోలు ప్రభుత్వానికి చెప్పుకుంటూ వచ్చారు. సర్వే చేయడానికి విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్‌లనైనా నియమించాలని వినతిపత్రాలు ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అసిస్టెంట్లను నియమించే సర్వే చేస్తున్నందున తమకు ఈ సదుపాయం కల్పించాలని మొరపెట్టుకున్నారు.

**ఏఈవోలపై ఎందుకంత కాఠిన్యం..**

కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం డిజిటల్ సర్వే చేసేందుకు అదనపు సిబ్బందిని నియమించుకోవాలి. కానీ, రాష్ట్ర ప్రభుత్వం మాత్రం ఆ మార్గదర్శకాలను పట్టించుకోవడం లేదని, కేంద్రం నుంచి వచ్చిన నిధులను దారి మళ్లించేందుకు మా నెత్తిన సర్వేను రుద్దాలని చూస్తున్నదని ఏఈవోలు ఆరోపిస్తున్నారు. సర్వే చేయలేదని కక్షతో రైతు మరణాల నమోదులో అలసత్వం ప్రదర్శించారనే కారణాన్ని చూపి కొందరు ఏఈవోలను సస్పెండ్ చేసిందని మండిపడుతున్నారు. మంచిర్యాల జిల్లాలో ఐదుగురు, కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలో ఐదుగురిని సస్పెండ్ చేసినట్లు తెలిసింది. కాగా, జిల్లా అధికారులు మాత్రం ఈ విషయాన్ని ధ్రువీకరించడం లేదు. సస్పెండ్ చేశాం కానీ ఆ వివరాలు చెప్పలేమంటూ దాటవేస్తున్నారు. నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాల్లో ఏఈవోల సస్పెన్షన్‌పై ఎలాంటి ఉత్తర్వులు వెలువడలేదని చెప్పారు. ఇలా రాష్ట్రవ్యాప్తంగా 165 మంది ఏఈవోలను సస్పెండ్ చేసినట్లు తెలిసింది. మా కష్టాన్ని గుర్తించి అండగా నిలవాల్సిన ప్రభుత్వమే మా విషయంలో ఇంత కఠినంగా ఎందుకు వ్యవహరిస్తుందో అర్థం కావడం లేదని ఏఈవోలు వాపోతున్నారు.

**ఒకొక్కరి పరిధిలో వేలాది ఎకరాలు..**

గతంలో బీఆర్ఎస్ సర్కారు ఐదువేల ఎకరాలకు ఒక ఏఈవోను నియమించింది. 1500 కొత్త ఏఈవో పోస్టులను సృష్టించి, 2601 రైతు వేదికలను ఏర్పాటు చేసింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 307 మంది ఏఈవోలు ఉన్నారు. కాగా, సగటున ఒక్కో ఏఈవో పరిధిలో 6 వేల ఎకరాల నుంచి 12 వేల ఎకరాలున్నాయి. కొందరికైతే 18 వేల ఎకరాల వరకు ఉన్నాయి. ఈ మేరకు ఒక్కో అధికారి అన్ని వేల ఎకరాలు సర్వే చేయడం, క్రాప్ వివరాలు ఆన్‌లైన్ చేయడంతో పాటు అక్కడే ఫొటో దిగి అప్‌లోడ్ చేయడం సాధ్యమయ్యే పనేనా అని ఏఈవోలు ప్రశ్నిస్తునారు. ఇప్పటికే ఉన్న పనితో సతమతమవుతున్నామని వాపోతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఉద్దేశపూర్వంగానే ఏఈవోలను సస్పెండ్ చేసిన ప్రభుత్వంపై సమరానికి సిద్ధం అవుతున్నామని తెలిపారు. సస్పెన్షన్‌లకు నిరసగా నేడు(బుధవారం) మాస్ లీవ్‌కు జిల్లాలోని ఏఈవోలు పిలుపునిచ్చారు. సస్పెండ్ చేసిన ఏఈవోలను బేషరతుగా తిరిగి విధుల్లోకి తీసుకోవాలని, డిజిటల్ సర్వే చేసేందుకు అసిస్టెంట్లను ఇవ్వాలని, లేనిపక్షంలో ప్రత్యేక ఏజెన్సీకి ఆ బాధ్యత అప్పగించాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు నేటి నుంచి ఉద్యమాలు చేయనున్నట్లు పేర్కొన్నారు. మరి ఈ విషయంలో ప్రభుత్వం ఎలా స్పందిస్తుందన్నది వేచి చూడాల్సి ఉంది.

**ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పని చేస్తున్న ఏఈవోల వివరాలు..**

| జిల్లా | ఏఈవోల సంఖ్య |
|---|---|
| ఆదిలాబాద్ | 103 |
| నిర్మల్ | 79 |
| ఆసిఫాబాద్ | 70 |
| మంచిర్యాల | 55 |
| మొత్తం | 307 |

**❖ ఏఈవోలపై సస్పెన్షన్ ఎత్తివేయాలి**



రాష్ట్రవ్యాప్తంగా 165 మంది ఏఈవోల సస్పెన్షన్‌ను ఎత్తివేయాలి. అప్పటి వరకు మాస్ లీవ్‌లు కొనసాగుతాయి. గ్రామానికో అసిస్టెంట్‌ను ఏర్పాటు చేస్తేనే డిజిటల్ సర్వే చేస్తాం. కక్షపూరితంగా చేసిన సస్పెన్షన్‌లను ఎత్తి వేసే వరకు నిరసనలు, మాస్ లీవ్‌లు కొనసాగిస్తాం. త్వరలోనే మా తదుపరి కార్యచరణ ప్రకటిస్తాం.

**మేడ రాజ్‌కుమార్, టీఎస్ఏఈవోల సంఘం జిల్లా అధ్యక్షుడు**

# పెండల్‌వాడను సందర్శించిన ట్రెయినీ కలెక్టర్లు

జైనథ్, అక్టోబర్ 22 : పెండల్‌వాడ గ్రామాన్ని మంగళవారం ట్రెయినీ కలెక్టర్ బృందం సభ్యులు సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఆత్మ లింగ హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పథకాలను మండల అధికారులను అడిగి తెలుసుకున్నారు. దీంతోపాటు మండలంలో గ్రామంలో రైతులు సాగు చేస్తున్న పత్తి, సోయా, కంది తదితర పంటలను రైతులను అడిగి తెలుసుకున్నారు. పెండల్‌వాడలోని పల్లె దవాఖానను సందర్శించి రోగులకు అందిస్తున్న సేవలను పరిశీలించి పెండల్‌వాడ చెరువును సందర్శించి పరిశీలించారు. ట్రెయినీ కలెక్టర్‌లు సిమ్రాన్, ఖమురొద్దీన్, పవన్ జ్యోత్ కౌర్, మొహిద్‌రావత్, వెంకట్‌రావ్, చానినాథ్, వీడీసీ చైర్మన్ అల్లూరి నారాయణరెడ్డి, మాజీ సర్పంచ్ జంగిలి నవనీత సురేష్, ఉప సర్పంచ్ నాగుల నరేశ్, ఎంపీటీసీ కాసర్ల అశోక్, ఎంపీడీవో వెంకట్‌రాజ్, గ్రామ కార్యదర్శి గెడం సూరజ్, ఫీల్డ్ అసిస్టెంట్ జీవన్ పాల్గొన్నారు.

**పొన్నారిలో పర్యటన**

తాంసి, అక్టోబర్ 22 : పొన్నారి గ్రామంలో ఆరుగురు ట్రెయినీ కలెక్టర్లు మంగళవారం ఇంటింటికీ తిరుగుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంక్షేమ పథకాల వివరాలను నమోదు చేశారు. ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా లేదా అని లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్లు సుబీ చౌహాన్, విశ్వదీప్ మట్టు, అమర్ జీత్ కుజురు, కుల్దీప్ మీనా, ప్రశాంత్ నానావారి, పూజా కుమారి, పంచాయతీ కార్యదర్శి గంగన్న, నాయకులు గడుగు గంగన్న, రఘు పాల్గొన్నారు.


పెండల్‌వాడ ఆలయాన్ని సందర్శించిన ట్రెయినీ కలెక్టర్ల బృందం

# బ్రెస్ట్ క్యాన్సర్‌పై అవగాహన పెంచుకోవాలి

● రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్



ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో మాట్లాడుతున్న రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్

ఎదులాపురం, అక్టోబర్ 22 : బ్రెస్ట్ క్యాన్సర్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకుని, ఆరోగ్యంగా ఉండాలని రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ అన్నారు. మంగళవారం రిమ్స్ మెడికల్ కళాశాల నుంచి బ్రెస్ట్ క్యాన్సర్ అవేర్‌నెస్ వాక్‌ను డీఎంహెచ్‌వో కె.కృష్ణ, ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి ఎం.శ్రీధర్‌తో కలిసి ర్యాలీని ప్రారంభించారు. రిమ్స్ నుంచి ప్రారంభమైన మార్నింగ్ వాక్ కలెక్టర్ చౌక్ మీదుగా ఇందిరా ప్రియదర్శిని మైదానం వరకు సాగింది. బ్రెస్ట్ కాన్సర్ రాకుండా ఆరోగ్యపరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, తదితర అంశాలపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో రిమ్స్ అంకాలజిస్ట్ డాక్టర్ జక్కుల శ్రీకాంత్, వైస్ ప్రిన్సిపాల్ విద్యావిలాస్, డాక్టర్ సిందుజా, పెసర్ డాక్టర్ సత్యనారాయణ, వైద్యులు దీపక్, విజయలక్ష్మీ ఉన్నారు.